# సతులలో నెరజాణ

## ముందుగా ఆవిడ రుసరుసలాడిందో లేక నేనాడానో కానీ, చిలికి చిలికి గాలి వానైంది. గొడవగా మారింది.

ముందుగా మా ఆవిడే రుసరుసలాడి వుంటుందని నా నమ్మకం. ఆవిడకది అలవాటు కాబట్టి. గొడవైనా, గడబిడైనా ఆవిడదే పైచేయి అవుతుంది కాబట్టి. అలాగని ఆవిడకు పెళ్లయిన పది హేనేళ్లుగా తెలుసు కాబట్టి. అన్నిటా ఆవిడే సునాయాసంగా నెగ్గుతుందన్న నమ్మకం ఆవిడకి వుంది కాబట్టి.

అలాగంటే ఆవిడ అమెజాన్‌లా వుండదు. అందంగా, సుకుమారంగా కడిగిన ముత్యంలా వుంటుంది.

అయితే,

ఆవిడ చూపుల్లో తూపులుంటాయి.

మాటల్లో జోరుంటుంది.

నాలుకలో గుండె దడ పుట్టించే చురుకుంటుంది. కానీ, ఇదేం ప్రణయకలహమా లేక పాని వల్లలోనే తాగే కాఫీ విషయమా? ఊదే సిగరెట్ల విషయమా - పెరిగిపోతోందని చెప్పబడుతున్న నా పాకెట్‌మనీ విషయమా - ఫ్యాక్టరీ నుండి నేను ఇంటికి ఆలస్యంగా వచ్చిన సందర్భమా? మామూలు విషయాలయితే, మామూలుగానే సర్దుకుపోయే వాడిని. ఏదోలే - వాగుడుకాయ, ఎప్పుడూ ఏదో ఒకటి అంటుంటే గాని ఆవిడకి తోచదు అని సర్ది చెప్పుకునే వాడిని.

కానీ, ఇది కళకి సంబంధించిన విషయం.

లలిత, లావణ్యాల విషయం.

కమ్మని వారి సంగీత కళ, నృత్యకళల విషయం! నాకు సంగీతం రాదు. నాట్యం తెలీదు. అలాగని నాటిని అభిమానించకూడదు, ఆరాధించకూడదు అంటే ఎలా? కార్మికుడికి కళలేమిటి - సుత్తి, ట్రాక్ డ్రైవరు, గ్రీజు మరకలు, సైరన్ కూతలు వుంటే చాలనా అని ఆవిడన్న మాటలు నిజమేనేమోనని నిర్ణయించుకున్నా కార్మికుడి కూతుళ్లూ అలానే వుండాలని రూలుందా? లలిత పల్లవి, లావణ్య, అంజలి అని పేర్లు తగిలించాము కదా. పైగా ఆడపిల్లలన్న ఇంగిత జ్ఞానం ఏడవ వద్దూ?

ఆ మాటంటే,

కళ కూడు పెడుతుందా?

డాన్స్ డబ్బులు రాలుస్తుందా?

సంగీతం సంపద కలిగిస్తుందా?

అని సాధింపులు మొదలెట్టింది!

ఆనందంగా సంగీత సుధ తాంక తోస్తూ, నృత్యాంజలి ఘటిస్తున్న పిల్లలిద్దరిచేత సంగీతం, నాట్యం మాన్పించి గోడ కుర్చీలు వెయ్యమంది. అదేమిటని అడిగితే, వాళ్లిద్దరి ప్రోగ్రెస్ రిపోర్టులు నా మొహాన కొట్టి "చూసుకోండి మీ కూతుళ్ల ప్రతాపాలు" అని రామాయణం చదివేసింది ప్రమీలా కుమారి!

పరీక్షల్లో మంచి మార్కులు తెచ్చుకున్నప్పుడు, ఎవరైనా వాళ్లని మెచ్చుకున్నప్పుడు వాళ్లిద్దరూ తన ముద్దుల కుమార్తెలై పోతారు. మంచి మార్కులు రానప్పుడు, అల్లరి పనులు చేసినప్పుడు నా కూతుళ్లయిపోతారు. మంచికంతా ఆవిడ ప్రతినిధి. చెడ్డకు చేదేది నేను. దీంతో పిల్లలిద్దరికీ నాన్నెప్పుడు దాటి కూతుళ్లో - ఎప్పుడు అమ్మ కూతుళ్లో తెలిసిపోయింది.

చదివే రామాయణమైనా రమణీయంగా వుంటే బాగుంటుంది. లంకాదహనం వీరాంజనేయుల తోకలా మండుతూ, పొగలు సెగలు చిమ్ముతూ, చిటపటలాడితే, చిర్రెత్తుక రాదూ?

"నేను ముందే చెప్పానా, ఈ గొంతు చించుకోవటాలు, కుప్పిగంతులు మనకి అచ్చిరావని! పెద్దది ఏడులో ఏడుస్తోంది - పబ్లిక్ వుందని మీకైనా తెలివుందా? చిన్నది నాలుగులోనే వుంది నాకేం పట్టింది అనుకుంటున్నారా? ఎప్పుడూ ఆ టీవీ ముందు అఘోరిస్తుంటే చూస్తూ వూరు కుంటారేమిటండీ? పైగా వి.సి.ఆర్. ఒకటి! స్వయంగా వెళ్లి కేసెట్స్ తెచ్చుకునే దాకా వచ్చా రిద్దరూ! ఇంతకు ముందు నా కూతుళ్లు క్లాసులో ఫస్టు అంటూ మూతిమీసాలు తిప్పి నిమ్మకాయలు నిలబెట్టారుగా. శుబ్బరంగా రేజర్‌తో గొరిగేసుకోండిక! హాయిగా బడి మాన్పించెయ్యరాదూ - వంట పనైనా నేర్పుతాను" అంది!

అంతటితో ఆగక, సమాన హక్కుల గురించి మాట్లాడింది. తనూ నాతో సమంగా ఉద్యోగం చేస్తున్నానని అంది. ఊళ్లో ఉద్యోగం, ఇంట్లో వూడిగం కాక, పిల్లల చదువులూ తనే ఎందుకు చూసుకోవాలని అడిగింది. నలభై ఏళ్లు వచ్చేస్తున్నాయి, ఇంకా ఆ టెన్నిస్ ఆటలేమిటని అడిగింది. మీరేమైనా వింబుల్డన్‌కి వెళుతున్నారా అని పొగడేసింది. బరువంతా భార్యపై వేసి, ఆటలాడుతూ - పిల్లల్ని ఆటాపాటల్లో ముంచి, చదువు సంకనాకించే తండ్రి ఎక్కడా చూడ లేదంది.

ఆపై, "వంశమా - నాదబ్బలోకా!" అని ముక్కున వేలేసుకుంది పిల్లల వైపు చూస్తూ!

అలా అంటే అర్థమేమిటని అడిగారు వాళ్లు.

"మీ తాతని అడగండి" అంది ప్రమీల.

అప్పుడు ఒళ్లు మండింది నాకు.

మీ వంశం గొప్పతనమేమిటని అడిగాను.

వాళ్ల వంశంలో అందరూ డాక్టర్లు, ఇంజనీర్లట! పుడుతున్నప్పుడే స్టెతస్కోపులు, టీ- స్క్వేర్లూ పట్టుకు పుట్టారుట. అప్పటప్పటా ఐ.ఎ.ఎస్., ఐ.పి.ఎస్. ఆఫీసర్లు వున్నారుట. తను మటుకు నన్ను కట్టుకున్న కర్మకొద్దీ బ్యాంక్ క్లర్కు అయిందట. మా వంశంలో అందరూ నాటకాలాడి, సంగీత కచేరీలు చేసి స్టేజిపై షేక్స్పియర్‌ని, త్యాగరాజుని ఖూనీ చేశారుట. తను కట్టుకున్న అదృష్టానికి నేనీమాత్రం అఘోరిస్తున్నానుట!

వంశం అంటే ఏమిటో అప్పటికి అర్థమైన ఆడ పిల్లలిద్దరూ "అబ్బలోక" అంటే ఏమిటని అడిగారు.

"లోక కాదు - లోకలు! మీ తాతకి మీ రిద్దరూ లోకలు. మీకు సంగీతం, డాన్సు లోకలు. ఈ లోకలని కోసిపారేస్తే గాని లాభం లేదు!" అంది.

మొత్తం ఎన్ని లోకలు అని అడిగారు వాళ్లు.

"ఆ మాత్రం తెలిస్తే, మీ లెక్కలం పేపర్లెందుకు అలా ఏడుస్తాయి? చదువు మానేసి ఒకరి తోక లొకరు లెక్కపెడుతూ కూర్చోండి. ఆ లెక్క పెడుతున్నప్పుడు, పరమానందయ్య శిష్యుల్లా ఎవరి తోకలు వాళ్లు లెక్కపెట్టుకోవడం మరవకండి" అంది ప్రమీల.

మా నాన్నగారి పేరు పరమానందంగారు. అదీ ఆవిడ పలికిన ఫన్! వాళ్ల నాన్నగారి పేరు వీరాంజనేయ శాస్త్రి. ఆయన పేరు బట్టి రిపార్టీ ఇవ్వాలని ప్రయత్నించినా, ఏం పలికి చావాలో తోచలేదు నాకు.

ఆ రాత్రి మా ముగ్గురికీ ఆకళ్లు వెయ్యలేదు. ప్రమీల మటుకు సుష్టుగా తిని, పడక గదిలో రామకృష్ణ పరమహంస పుస్తక మొకటి పట్టుకుని నిద్రపోయింది. దాబాపై జంపఖానా పరచి, తలగడపై తలవాల్చి, అటో పిల్లా - ఇటో పిల్లా చెరో చెయ్యి నా గుండెలపై వేసి కలవరిస్తూ కలత నిద్ర పోతుంటే, నిద్రరాక ఆకాశంలోని మబ్బుల చాటు చంద్రుడిని, తరగిపోతున్న చంద్రకళని చూస్తూండిపోయాను నేను.

చల్లని పిల్లగాలులు వీస్తున్నాయి. దాబానంటి పెట్టుక వున్న వేపచెట్టు గాలిదాటికి తలవూపుతూ, తెల్లని వెన్నెల పూతని రాలుస్తోంది అప్పుడప్పుడూ.

ఆ వెన్నెట్లో - ఆ పల్లగాలిలో,

హఠాత్తుగా నాకేదో అన్యాయం జరిగినట్టని పించింది!

అన్యాయం జరిగిందని తెలిసిన మొదటి రాత్రి కూడా, దాబాపై పండువెన్నెల్లో, నునుడే వేప పూతం రాల్లలో పుంతలు త్రొక్కింది. అప్పటి పిల్లలింకా పుట్టుక రాలేదు. పెళ్లి పాయలు తరగలేదు.

నన్ను జాజులు తురుముకుని, మునిబాలలా కూర్చున్న ఆమెనే, ఆమె అందాన్ని చూస్తూ

- ఎమ్. ఆర్. ప్రసాద్



పరవశించిపోయాము. ఇంత చక్కటి అమ్మాయి నా పెళ్లాం కదా అని పొంగిపోయాము. గోముగా, నా గుండెలపై తలవాల్చి తన గుండెలపై వాలుజడ వేసుకుని, ఆకాశంలోని చందమామని చూస్తూ కూనిరాగం తీస్తోంది ప్రమీల.

"ప్రమీలా పాట పాడవూ?" అడిగాను.

చటుక్కున లేచి కూర్చుంది!

"నాకు పాటలు రావు" అంది.

"అబద్ధాలాడకు. ఆడపిల్లలు పుడతారు"

"ఆడపిల్లలు మటుకు వద్దు బాబూ!" అంది.

"నీలాంటి అందగత్తెలవుతే, ఆడపిల్లలే బాగుంటారు"

"అప్పుడు వాళ్లని పాట పాడమని ఎవరో అడుగుతారు"

"చక్కగా పాడతారు"

"లేదు. పాట రాదంటారు"

"ఎప్పటికీ అలా కాదు" అన్నాను.

"పోనీండి - మంచిదే" అంది పొడిగా.

"ఇంతకీ పాట పాడవా?"

"రాదన్నాగా"

"అబద్ధం! సంగీతం, నాట్యం నేర్చుకున్నావని మీ నాన్నగారు చెప్పారు".

"వెయ్యి అబద్ధాలాడైనా ఒక పెళ్లి చెయ్యమన్నారు"

"మీ నాన్న అబద్ధాలాడే మనిషి కాదు"

"ఎప్పుడెప్పుడో నేర్చుకున్నది సంగీతం, నాట్యం అనబడుతుందా?"

ఎందుకో వెన్నెల చల్లదనం గోల్పోయింది!

పిల్లగాలుల్లో హాయి తరిగి పోయింది!

"పాడాల్సిందే" అన్నాను.

మారు మాటాడక సన్నగా రాగం అందుకుంది. సుతిమెత్తగా, శ్రుతి పెట్టిన వీణలా వుంది కంఠం! పురి విప్పి ఆడుతున్న నెమలిలా వుంది మాధుర్యం!

"నిదురమ్మా - నిదురమ్మా
కదలి వేగమె రావమ్మా"

సందర్భోచితంగా లేదు పాట!

ఏదో జీర! మరేదో బాధ!

"పాలా మబ్బుల పాన్పుమీద
నీలాల తెరలైన మూసి
గాలి వీణన బూని హాయిగా
జోలం పాడగ..."

హఠాత్తుగా ఆపి, ఆయాస పడి పోయింది!

వెక్కి వెక్కి ఏడ్చింది!

కారణమడిగినా చెప్పలేదు. నా గుండెలపై తల వుంచి, కన్నీళ్ల నాపటానికి కన్నట్లుకనురెప్పల మూసుకొంది. అటు తరువాత నిద్రపోయింది.

నాకు నిదుర రాలేదు.

గాలి వీవనబూని వీయలేదు.

పాల మబ్బులు దాటి నిశాకరుడు నిశిత శూలాల పొడిచాడు!

మాయని గాయాల రగిల్చాడు!

ఉదయం బావమరిది చెప్పాడు. "అక్కయ్యకి వీక్ లంగ్ వుంది బావా. పాడితే ఆయాసం వస్తుంది. అదీకాక అక్కయ్యకి పాటలు, డాన్సులు అంటే అసహ్యం",

విశాఖ వచ్చాక, పేరు మోసిన డాక్టర్ దగ్గరకు తీసుక వెళ్లాను. ఎప్పుడో ఆపరేషన్ చేసి వుంటే బాగుండేదన్నాడు. ప్రమాదమేమీ లేదన్నాడు. ఒక లంగ్ ఆరోగ్యంగానే వుంది, వర్రీ కాకన్నాడు. ఆయాసం తప్పదన్నాడు. ట్రీట్‌మెంటేమీ అక్కర లేదన్నాడు. మంచి తిండి తిని, బలం పుంజుకుంటే ఆయాసం తగ్గిపోవచ్చునన్నాడు. ఇదంతా తనకి ముందే తెలుసునన్నట్టు, క్రొత్తదేం కాదన్నట్టు నిశ్చలంగా, నిర్లిప్తంగా నిలబడి వుంది ప్రమీల!

అటు తరువాత తనని నేనెప్పుడూ పాట పాడమని అడగలేదు.

తను పాడలేదు.

ఒక అనుమానం మిగిలి వుండేది. వీక్ లంగ్ వున్నంత మాత్రాన, పాటలు నాట్యాలు అసహ్యించుకునే స్థితికి ఆమె వచ్చిందంటే నమ్మబుద్ధి కాలేదు. ఇంకేదో బలమైన కారణం వుండాలనిపించింది.

నేను అడగలేదు
తను చెప్పలేదు

* * * *

నేను అడగనిది,
తను చెప్పనిది.

మరొకటుంది!

పెళ్లయిన రెండేళ్ల దాకా నాకీ విషయం మాచాయగానైనా తెలీదు. అప్పట్లో మేము యారాడా పార్కు ప్రాంతాల్లో వుండే వాళ్లం. కొద్దిపాటి జీతం, రెండు గదుల అద్దె కొంప అయినా, క్రొత్తకాపురం, క్రొత్త జంట కావడంతో జీవితం రంగులహరి విల్లులా వెలిగేది. రంగుల కలలా సాగేది. ఏదో రమణీయత తోచేది. హాయిగా, తియ్యగా వుండేది.

తీపిలో చేదులా,
శ్రుతిలో అపశ్రుతిలా,
కస్తూరి ఉత్తరాలు వచ్చేవి!

కస్తూరి, ప్రమీల ప్రాణ స్నేహితురాలు. స్కూల్ నుండి కాలేజీ దాకా కలిసి చదువుకున్నారు. కస్తూరి మగవాడై వుంటే, తను ప్రేమించి పెళ్లాడేసి వుండేది. కాక పోవడంతో వున్న ఊర్లోనే కళ్ల డాక్టర్ని పెళ్లాడిందామె. కార్మికుడిగా ముద్ర వేయబడిన ఇంజనీరు ఇల్లు చేరిందీవిడ.

కస్తూరి ఉత్తరాలు కళ్లబడగానే కలవర పడి పోయేది ప్రమీల. చదివిన ఉత్తరాన్నే పదే పదే చదువుకుని పరితపించి పోయేది. పరితాపమేమిటని ప్రశ్నిస్తే, పొడి జవాబులు చెప్పేది.

కస్తూరి కన్న వారిని కాదని, కళ్ల డాక్టర్ని పెళ్లాడింది. ప్రేమగా ప్రేమించుకున్నాక కత్తులు దూసి కథాకళి మొదలెట్టారు. కళ్ల డాక్టరు కస్తూరి చెంప కందిపోయేలా కొట్టాడు. కన్నీళ్లు మా ఆవిడకు వచ్చాయి!

మధ్యలో మరో రెండు పాత్రలు
వేదవతి టీచరు
సన్యాసి మేష్టారు!
వాళ్లిద్దరూ భార్యా భర్తలు
వేదవతి రిటైరైంది.
మా ఆవిడకి దిగులు పట్టుకుంది!
సన్యాసి మేష్టారుకి ఒంట్లో బాగులేదు.
మా ఆవిడ దిగాలు పడి కూర్చుంది!

అలాంటి వార్తల గుబాళింపుతో కస్తూరి ఉత్తరాలు గుప్పించినప్పుడల్లా, మా ఇంట్లో గబ్బిలాల కంపు కొట్టేది!

ఈ లోగా నాకు ప్రమోషన్ వచ్చింది. బరువు బాధ్యతలు పెరిగాయి. పన్నెండు గంటల షిఫ్ట్ డ్యూటీలు పడ్డాయి. ప్రమీలకి ఒంటరితనం విసుగెత్తించింది. ఉద్యోగం చేస్తానంది. బ్యాంక్ పరీక్షలు రాసింది. టౌన్లో ఇల్లు తీసుకున్నాక, డ్యూటీలో జాయినైంది. ఇద్దరం ప్రొఫెషన్లలో వుండడం చేత తీరిక తక్కువైంది. విరామం లేక విసుగెక్కువైంది.

ఆ తర్వాత కస్తూరి నుండి కబురు ఒకటి వచ్చింది!

కస్తూరి మొగుడు డైవర్స్ కావాలన్నాడట! వేదవతి సన్యాసిగార్ల ఏకైక పుత్రుడు వున్న ఊర్లోనే పెళ్లాంతో విడికాపురం పెట్టాడట!

ప్రమీల కలవర పడి పోయింది.

కన్నీటి వర్షం చిమ్మింది.

కోపంతో ఆడవారి హక్కుల గురించి, ఎదిగిన కొడుకుల బాధ్యతల గురించి, చింక లెక్చరిచ్చింది.

అటుపై, "మీ ఆశయాల మాటేమిటి?" అని నన్ను నిలవేసింది!

"నేనేం చేశాను మధ్యలో!"

"కట్నం తీసుకోనన్నారుగా! ఆడదాని సొమ్ము ఆశించనని అన్నారుగా!"

"అన్న మాట నిజమే"నన్నాను.

"ఇకపై కూడా అలానే వుండండి" అంది.

అలాగేనని ఆమె మాటిచ్చి పడి వున్నా, తనేదో అసందర్భంగా మాట్లాడిందనిపించింది. మా యిద్దరి మధ్య అరమరికలేమిటని ఆవేదన కలిగింది. కస్తూరిపై కోపం వచ్చింది. కుదిరితే పీక నులిమెయ్యాలనిపించింది.

కూచిపూడిలో మండూక శబ్దం గుర్తుకు వచ్చింది.

కళ్యాణి రాగంలో ముఖారి మేళవించినట్లయింది.

* * *

చిన్నప్పుడు మేము ముఖారి రాగాల మొహాల తోచినప్పుడల్లా, అమ్మ కళ్యాణి పాడేది. నాన్నకి కాపి రాగంతో కాఫీ అందించేది. పదరపాలనువిప్పించేస్తూ నవరాగ మాలిక అందుకునేది. ఇంట్లో ఆనందభైరవి వెల్లి విరిసేది.

అమ్మ స్రష్ట అయితే - నాన్న ద్రష్ట!

అమ్మకి తెలిసిన సంగీతం శాస్త్రీయమైతే నాన్నకి తెలిసిన గీతం నాటకీయం. బళ్లారి రాఘవ శిష్యు డాయన. ఇంట్లో కవి - కాలేజీలో ప్రిన్సిపాల్. అమ్మ పాటకి నాన్న వయొలిన్ జోడీ అయితే, నాన్న మృదంగానికి అమ్మ నృత్యం తోడయ్యేది. వాళ్లకి కళలోని జీవం తెలుసు. జీవించే కళ తెలుసు. అందుకే వారి జీవితం ఒక సంగీత సాహిత్య లహరిగా వెలసింది.

రాత్రి భోజనాలయ్యాక, డ్రాయింగ్ రూమ్ డయస్‌గా రంగులు పులుముకొనేది. నాట్య వేదిక అయ్యేది. సంగీత సభగా మారేది. కవన కావ్యాలతో అలరారి, సాహితీ చర్చా వేదికగా మారేది. ఏడేలు రాగాల వినేది!

వాళ్లకున్న లోటల్లా మేము ముగ్గురం మగ వలుములు కావడమే. మా మధ్యలో మచ్చుకైనా ఓ అమ్మాయి లేక పోవడమే. కళకి ఆడ పిల్లకీ గల అవినాభావ సంబంధమే. వారి కళల దీపకళికలా నిలిచే కళామూర్తి జన్మించక పోవడమే!

అమ్మ పోయింది.

ఆ తరువాత నాన్నపోయారు.

కళ పోయింది.

కానీ, కళాభిమానం మిగిలింది.

ఆఖరి రోజుల్లో అమ్మ అంటూ వుండేది "పిల్లందరికీ ఆడ పిల్లలే పుట్టాలి. వాళ్లందరికీ నేను సంగీత నాట్యాలు నేర్పాలి" అని అమ్మ కోరుకున్నట్టు గానే ఆడపిల్లలే పుట్టారు. పోయిన వారి గుర్తుగా, నాలో నాకు తెలీకనే పెరిగిపోయిన అభిరుచుల కనుగుణంగా, పిల్లలిద్దరికీ సంగీతం, డాన్సు నేర్పించాలను కుంటే, ఈవిడ కాదంటుంది!

* * * *

కాదు పొమ్మని

వారం రోజుల తరువాత వాళ్లిద్దర్నీ చెరో ప్రక్క చేర్చుకుని, కథ ఒకటి మొదలెట్టింది!

అప్పుడు,
ఆ కథలోకి,
కమ్మగా కదలి వచ్చింది కస్తూరి.
కళకళ లాడుతూ కదలొచ్చారు—
వేదవతిగారు, సన్యాసి మేష్టారు!
అనగనగా,

అఖండ తేజోవతి వేదవతి. ఆమె నృత్యం- నృత్యమే ఆమె. నాట్యకళకి ఆమె ఓ దివ్యాంజలి. ముకుళిత నృత్యాంజలి! అపర త్యాగరాజు ఆతడు. ఆతనే సంగీతం- సంగీతమే ఆతడు. సంగీత కళకు ఆతడో బ్రహ్మాంజలి. మడి పుష్పాంజలి! వారిద్దరూ సర్వ

వచ్చే సంచిక నుంచే



ఉపద్రష్ట శాయి
కొత్త సీరియల్

# మీ/వారి మాటలకు అర్థాలే వేరులే




■

''మా ఇంట్లో దొంగలు పడ్డారు. తొందరగా పోలీసులని పిలు'' పరిగెత్తుకొచ్చాడప్పారావు సుబ్బారావింటికి.

''మరి మీ ఆవిడని ఇంట్లో ఒంటరిగా వదిలొచ్చావేం'' అడిగాడు సుబ్బారావు.

''ఆవిడ ఒక్కత్తేం లేదు. దొంగని గట్టిగా పట్టుకుంది'' వగరుస్తూ చెప్పాడప్పారావు.

—గొల్లపూడి శైలజ

■

■ ఇల్లంతా వస్తువులతో నిండిపోయి ఇల్లు ఇరుకుగా వుంది. కదలటానికి, మెదలటానికి ఖాళీ లేకుండా వుంది అని మీ శ్రీమతి విసుగును ప్రదర్శించిందనుకోండి. ఇక ఏ వస్తువులూ కొననక్కర్లేదని, డబ్బు ఆదా అవుతుందని అని సంతోషపడబోకండి. దాని అర్థం. ఇంకా పెద్ద ఇల్లు అద్దెకు తీసుకుని ఇంకా ఎక్కువ వస్తువులు కొనమని ఆమె భావం.

-చావ శ్రీనివాస్,
చెంచుపేట, తెనాలి - 522 202.

■ ''ఏమండి ప్రతి రోజూ రాత్రి వేళ పాలు తాగాలా!'' అని మీ శ్రీమతి మిమ్మల్ని ప్రశ్నించిందనుకోండి దాని అర్థం సగం పాలు తనకు కూడా యివ్వమనికాదు. పాల ఖర్చు తగ్గించమని.

○ ''ఏమండీ! ప్రక్కింటి పావగారి కలర్ టి.వి. లో చిత్రలహరి ఎంత బాగుందనుకున్నారు'', అంటే మీ శ్రీమతి గారు మిమ్మల్ని కలర్ టి.వి. కొనమని కాదు సుమా! కనీసం మీరు పోర్టబుల్ టి.వి.ఐనా కొనమని దాని అర్థం!

—డి.వి. కోటేశ్వరరావు, నందిగామ

(ఈ శీర్షికకు మీరు మీ రచనలు పంపండి. మీ శ్రీమతి గారు ఒకటి చెప్పడానికి బదులుగా మరొకటి చెప్పిన విషయాన్ని మీ శ్రీవారు ఒకటి చెప్పడానికి మరొకటి చెప్పిన వైనాన్ని మీకు తోచిన విధంగా రాసి పంపండి. సముచిత పారితోషికాన్ని అందుకోండి)

జనావళికి శుభము కలిగించనే తెంచిన కారణజన్ములు!

సన్నగా రివటలా వుండే వేదవతి గజ్జెకడితే, పట్టు వాంగంతో నర్తనశాలని సృష్టించేవారు మేష్టారు. సన్యాసి గారు గానం చేస్తే, వీణారవాన్ని కురిపించేది వేదవతి. వారు ఎన్నో ప్రోగ్రాములిచ్చారు. ఎన్నెన్నో కార్యశాలాలలో పాల్గొన్నారు. మరెన్నో సత్కారా లను చేశారు. అనంత ఖ్యాతి గడించారు. వారిద్దరూ రోడ్లో నడుస్తూంటే, ఎందరో గృహిణులు ఆదరంతో చిరునవ్వులు చిందించేవారు. కళాభిమానులు విన యంగా నమస్కరించేవారు!

అప్పటికే మేష్టారు రిటైరయ్యారు. గర్ల్స్ స్కూల్లో టీచర్‌గా పని చేస్తూండేది వేదవతి. కళా సేవే కాని కళని అమ్ముకోవాలన్న తలంపు లేదు వారికి. ఉన్న దాంట్లోనే సరిపెట్టుకుంటూ కళామతల్లికి నీరా జనాలు పట్టారు. ఎందరో కళామూర్తుల్ని తీర్చి దిద్దారు.

అలా తీర్చబడిన కళామూర్తుల్లో కస్తూరి ఒకతె. కస్తూరిలో కళ గుబాళించింది. సంగీత నాట్యాలలో సిద్ధహస్తురాలైంది ఆమె. ఆరేళ్లకే అరంగేట్రం యిచ్చింది. పన్నెండేళ్లకే స్టేజి మీద కనేక మేటి గాయనిగా కీర్తించబడింది!

అలాంటి కస్తూరికి, ఓ చెలికత్తె!

కళకై కస్తూరి కళాంజలి పడితే, చెలికత్తె- చెలిమికై చెలికత్తె కమనీయంగా పాడింది. రమణీయంగా నృత్యంచేసింది.

వారిద్దరికీ పోటీ అన్నారు. వీరిలో ఎవరు గొప్ప అన్న వాదోపవాదాలు బయలుదేరాయి. వాదనలకి తావివ్వక పాఠంగా కళారాధనకి మధుర మంగళం పాడేసింది చెలికత్తె! ఆమె అలా ఎందుకు చేసిందో ఎవరికీ తెలీదు- ఒక్క వేదవతి, సన్యాసి మేష్టారుకి తప్ప.

అర్థం కాని కస్తూరి ఆశ్చర్యపోయింది. అలా చెయ్యకంది. అలరింపుల ప్రతిమాలింది. తనకోస మైనా కళారాధన కొనసాగించమంది. పలకబోయిన గొంతు మూగబోగా, ఉలికే కన్నీటికి చీర చెరగుతో తుడుచుకుని, పాదశక్తి ఆదరక్తి తనకి లేదన్న ఆర్ద్రతతో నిలుచుండి పోయింది చెలికత్తె. ఆట పాటల నాపి, అమరత్తతో సన్యాసి పురోగమనాన్ని వీక్షించింది. ఆదరంతో గురుమూర్తుల దీవెనలందు కొనడం మరువక, మరపురాని స్వప్నంలా మిగిలింది!

కస్తూరి అవార్డులందుకుంది. పూలమాలల పుర స్కారాల మొదలింది! అన్ని హారాలు ఆ అది దంపతు లకు వేసి, సన్యాసిని కౌగలించుకుని పరవశించి పోయింది!

కస్తూరికి పెళ్ళయింది. వేదవతి రిటైరైంది.

కాలం కర్కశంగా కరచింది!

కళ్ల డాక్టర్‌కి కళ రుచించలేదు. స్టేజిపై పెళ్లాం గజ్జెల గొంతులు ప్రమింగుడు పడలేదు. సంగీత కచేరీలు కొరుకుడు పడలేదు. వారి జీవితంలో దుమారం రేగింది. అందరిలా జీవిద్దామన్నాడు అతడు. కళే తన జీవితం అంది కస్తూరి! విడాకులు తీసుకుంది!

ఒడి జీవితం మొదలిడింది.

ఆటు తరువాత అంతుతెలియక పోయింది!

కస్తూరిని కరచిన కాలం, కళామూర్తుల్ని విడిచి పెట్టలేదు. కళా సంపన్నులైన వారిని సంపాదనా విహీనులను చేసింది. దావానలం లాంటి దారిద్ర్యాన్ని విరజిమ్మింది. కళా విహీనులుగా మిగిలిపోయారు వారు. ఉన్నదంతా ధారపోసి పుత్రరత్నాన్ని పెంచు కుంటే, పెళ్ళయ్యాక పెంచిన వారికి దూరంగా పోయాడతను. అప్పులు తీర్చాల్సిన అవసరం తనకు లేదన్నాడు. కళల పడగల నీడలు తన ప్రబతుకు పండించవన్నాడు. తనకి కళ గానీ, కళామూర్తులుగానీ అవసరం లేదన్నాడు. కళ తిని ప్రబతికిందని వారి కర్మకి వారి వాదిలేశాడు. వాళ్ళు,

శుభాలు పలికిన
సాహితీ వరులు,
నాట్య కోవిదులు
వాళ్లని, అదుకోలేదు.
ఆదరించలేదు.

పెద్ద యోగీంద్రుల్లా మిగిలి పోయారువాళ్ళు!

* * *

"కథ కంచికి" అంది ప్రమీల.

"కస్తూరి సంగతి చెప్పకుండా కథ కంచికి పంపితే ఎలా?" అంది పల్లవి.

"ఇంతకీ కస్తూరి ఏమైంది?" అంది లావణ్య.

"నాకు తెలీదు!" అంది ప్రమీల.

"వేదవతిగారు, సవ్యసాచి మేష్టారు ఏమయ్యారు?"

"ఏమవుతారు-అలానే వున్నారు."

"అలానే అంటే?"

"బతకలేక, చావలేక."

"పాపం!" అన్నారు పిల్లలు.

"అందుకే కళల జోలి మనకి వద్దన్నాను" అంది ప్రమీల.

"అందరి జీవితాలూ అలా వుండవు. అర్థంలేని ఉదాహరణ లిచ్చి, ఉత్సాహాన్ని వూది పారేస్తున్నావు. కళ, కళకోసమే అనుకునే వారి కథ అలానే వుంటాయి" అన్నాను.

"కళ, కళ కోసం కాక మరెందుకు?" అంది ప్రమీల.

"జీవితం కూడా ఓ కళ అని మరువకు! ఓ కళలో మరో కళకి ముప్పొస్తే, మొదలు నరికిన ప్రాను అవుతుంది బతుకు."

"అందుకే బలమైన మొదలున్న ప్రానుల్లా తయారు చెయ్యమంటున్నాను పిల్లల్ని. ఆకులలో, కొమ్మలలో నిలబడి జీవితపు చిగుళ్లు వేస్తే చాలు. కళా పుష్పాల్ని పూచి పరిమళించక పోయినా, ఆ చెట్టు నీడ నివ్వక మానదు."

"నాన్సెన్స్! కళ హాబీగా కూడా వుండనివ్వు జీవితంలో!"

"ముందు జీవించేలా చెయ్యండి. తరువాత హాబీల గూర్చి ఆలోచించండి"

"అది సరైనా, నా కూతుళ్లతో సంగీత నాట్యాలు మాన్పించను" అన్నాను.

"అవును. మేమూ మానం" అన్నారు పిల్లలు.

"అయితే ముగ్గురూ కట్టకట్టుకుని, కళలో దూకి చావండి!" అని కళాత్మకంగా లేచి వెళ్లిపోయింది ప్రమీల.

ఈ గడబిడల్లో చెలికత్తె సంగతి అడగలేదు పిల్లలు. అడగాల్సిన అవసరం లేకపోయింది నాకు!

* * *

ఉన్న ఊర్లో ఉద్యోగాన్ని వదిలేసి హైదరాబాద్‌లోని ఓ ఫ్యాక్టరీ అధికారిగా తరలి వచ్చాను నేను. సొంత ఊరు చేరుకుంటున్నందుకు సంతసిల్లి, ట్రాన్స్‌ఫర్ ఆర్డర్లు అందుకుని మురిసిపోయింది ప్రమీల. అమ్మమ్మని, తాతయ్యని రోజూ చూడవచ్చని ముచ్చట పడిపోయారు పిల్లలు.

ఇంట్లో దిగి సామాన్లు సర్దుకొనే సరికి, ప్రమీలకి పట్టపగ్గాలు లేకుండాపోయాయి! పైగా నెల రోజుల

> **జీప్**
>
> "అదేంటి! ఆ పోస్టుమన్ జీప్ నడుపు తున్నాడు."
>
> "అతను రచయితల కాలనీకి ఉత్తరాలు పంచాలి. తిరిగివచ్చిన రచనలు ఎక్కువగా వుంటున్నాయని, డిపార్టుమెంట్ అతనికి జీప్ యిచ్చింది."

సెలవు పెట్టిందాయె. మెట్టినింట నిలువక, పుట్టింట గడప సాగింది. పాత స్నేహితురాళ్లందరినీ పరామర్శించ వెళ్ళింది. పలకరింతలతో పులకరించి పోయింది.

పది రోజుల తరువాత పునర్దర్శనం లభించింది. "ఆఖరికి మా గురుమూర్తులకి గుర్తింపు దొరికింది. వేదవతిగారికి, సవ్యసాచి మేష్టారుకి ప్రభుత్వం పద్మశ్రీ బిరుదుల నిచ్చింది! వాళ్లకి వచ్చే వారమే రవీంద్ర భారతిలో సన్మానం" అని మురిసిపోతూ చెప్పింది.

అటుపై, తను ఆ వారమంతా కనబడదని అంది. ప్రైజ్ పర్స్‌ని దంపతులకి ప్రెజెంట్ చెయ్యడానికి, కళాశాల సిస్టర్ క్రీస్తుకళతో ఊరంతా ఉరకలు వేసే కార్యక్రమంలో వున్నానంది. పుట్టింటి తరపున చందా సమాలు చేశానని అంది. మెట్టింటి తరపున చెయ్యమన్నాట పదహార్లు పెట్టింది. అదే సమయం అనుకొని "పిల్లల్ని వాళ్ళ దగ్గరకు పంపుదామా?" అనడిగాను.

దీనంగా, దిగులుగా చూసింది ప్రమీల. "పండు ముసలి వారండి. వాళ్లని ఈ వయస్సులో బాధ పెట్టడం దేనికి? పైగా డబ్బులు పుచ్చుకోరుకూడా" అంది.

మరి, ఈ ప్రైజ్‌పర్స్ సంగతేమిటని అడుగాలను కున్నాను. కానీ ఆవిడ ఉత్సాహాన్ని నీరుగార్చెయ్యటం ఇష్టం లేక మాట మళ్లించాను. వాళ్ల ఆరోగ్యాల గురించి అడిగాను. ఆర్థిక పరిస్థితి ఆరా తీశాను. ఇప్పుడెలా వున్నారని అడిగాను. "మీరే చూస్తారుగా సన్మాన సభలో" అని అటునుండి మాయమైంది.

ప్రమీల ఆశించిన ఘడియ ఆసన్నమైంది. సాయంకాలం ఆరింటికల్లా రవీంద్ర భారతిలో వుండాలని గుర్తు చేసి, పిల్లల చేతిలో పాస్ వుంచి, ఉదయాన్నే వుడాయించింది.

నా కంత పట్టింపు లేక పోయినా, ప్రమీల కోసం బయలు దేరాల్సి వచ్చింది. పిల్లల ముస్తాబు నాపై పడడంతో, ఆలస్యంగా చేరుకున్నాం. అప్పటికే చాలా కార్యక్రమాలు ముగిసి పోయివస్తున్నాయి. ప్రమీల ఎక్కడా కనబడ లేదు. ఎవరో వాలంటీర్ల సహాయంతో మూడో వరుసలో వెళ్ళి కూర్చున్నాము.

స్టేజిపై వేదవతి, సవ్యసాచి మేష్టారు కుర్చీల్లో కూర్చుని వున్నారు. వాళ్ల మెడల్లో దండలు. ప్రమీల కోసం మళ్లీ అటూ యిటూ చూసి, వేదిక పైకి దృష్టి మళ్లించే సరికి, సిస్టర్ క్రీస్తుకళ వాళ్లని సత్కరించడం జరిగింది. ప్రైజ్ పర్స్ అందజేయడం అయింది.

సభలో కరతాళ ధ్వనులు!

యాంత్రికంగా నేను, అలవాటుగా పిల్లలు చప్పట్లు చరిచాము,

సవ్యసాచి మేష్టారు మాట్లాడటానికి లేచారు. ఆయన వదనం గంభీరంగా వుంది. శరీరం ముసలి తనంలో వంగి పోయి వుంది. పండు మీసాలు మటుకు హుందాగా వున్నాయి. ప్రక్కనే వున్న వేదవతి గారు తేజస్సుతో వెలిగి పోతున్నారు. నుదుటిపై రూపాయి బిళ్లంత సిందూరం వుంది. చీర చెంగు సర్దుకుంటూ, సవ్యసాచి గారికి చేతికర్రని అందించింది. దాన్ని ఊతగా చేసుకొని ఆయన నిలబడితే సిస్టర్ క్రీస్తుకళ మైక్‌ని సవ్యంగా అమర్చింది.

గంభీర కంఠంతో, కరతాళ ధ్వనుల మధ్య మాట్లాడారు మేష్టారు. కళాభిమానులందరికీ నమస్కృతులందజేశారు. కళ గుర్తింపు - కళాకారులకి గర్వింపు అన్నారు. తామిద్దరం ఎంతగానో పొంగి పోతున్నాం అన్నారు. తన ముందు మాట్లాడిన వారు తను మాట్లాడటానికేమీ మిగల్చ లేదన్నారు. మర్యాద లోపిస్తే మన్నించమన్నారు. మాట జారితే మదిలో వుంచకోకండన్నారు.

గట్టిగా మైక్‌ని పట్టుకుని "అవార్డులు అందుకోటానికీ, సన్మానాలు చేయించుకోటానికీ కళ వుంటే సరిపోదు. కళాకారులు బతికి వుండాలి! అందుకే అందిన ఈ బిరుదులు, జరుగుతున్న ఈ సన్మానం కళకా, కళాకారులకా లేక ఆ కళాకారులని సజీవంగా వుంచి, మీ ముందు నిలచేలా చేసిన స్టెట్టు గొమ్ములకా అన్న సందిగ్ధత కలుగుతుంది నాకు!"

"తను గీసిన చిత్తరువులలో తనకే నచ్చినవి ఏ ఒకటో రెండో వుంటాయి చిత్రకారుడికి. సంతృప్తి నిచ్చే రచనలు కొద్దిగానే మిగులుతాయి రచయితకి. అలాగే మేము తీర్చిదిద్దిన కళాకారులలో ఇద్దరే నచ్చారు మాకు. కళలోనే కాక, సంస్కృతి సంస్కారాలలో మహోన్నతంగా ఎదిగి పోయారు. ఒకరు కళకే కళగా నిలచి పోతే, కళాకారులకి ప్రతీకగా నిలచారు మరొకరు. కళోపాసన చేస్తూ కదం త్రొక్కుతూ ఒకరుంటే, ఇల్లంత దూరాన నుండే అంజలి ఘటించారు మరొకరు. ఆ ముగ్ధ మనోహర కళా సౌందర్య మూర్తుల ముందు, మేము దిష్టి బొమ్మలమే! మా భాష్పాంజలి వారికి పుష్పాంజలిగా మిగిలితే మాకు అవే అవార్డులు - అసలైన సన్మానాలూనూ!

బహుశః, సహజ కళాకారులుగా జన్మిస్తారు కొందరు. కావ్యగన్నులైన గంధర్వుల తలపించ జేస్తారు. నాట్యగానాలలో సరిలేని కౌశలం ప్రదర్శించి కళాం బుధిని ఏలికి, కళల విరజిమ్ముతారు. కళా ప్రపూర్ణ లవుతారు. అలాంటి ఆ ఇద్దరిలో కస్తూరి నా ప్రథమ శిష్యురాలు! కళల కస్తూరి కమ్మగా పాడేది. నేర్పుతో నృత్యం చేసేది. చిరుత ప్రాయంలోనే గజ్జకట్టింది.

చిన్నవయసుననేక కచేరీలు చేసి పెద్దలతో శాలువలు కప్పించుకుంది. విదేశాల్లో పర్యటించి, స్వదేశానికి కీర్తి కాంతలా నిలచే సమయాన కళ ఆమెను కరచింది. కట్టుకున్న వాడు కళని కాదన్నాడు. కళాకారిణిని కాలతన్నాడు. కన్నవారు కసిరి కొట్టారు. పట్టెడన్నం పెట్టలేక పోయారు మాలాంటి కళల హీనులు. కళనే నమ్ముకున్న కుమారి, కట్టుకున్న వాడిని వదలి క్రీస్తు దరి చేరింది. క్రీస్తుకళగా మారింది! ప్రభుదయతో కళా సేవ చెయ్య సాగింది. కళకి కుల మతాలు లేవంటూ, క్రీస్తు మఠంలో నటరాజ మందిరం స్థాపించింది. కళాశాలని, సంగీత నాట్య వేదికగా మార్చింది. సంగీత నాట్యాల బోధన సాగింది. కళాకారులెందరికో నీరాజనాలు పట్టింది. అవరోరి యంలో అందిస్తూ, తన్న కంఠాలకి ఊపిరి పోస్తూ మేరీ మాతలా నిలచింది. అందుకే నా మెడలోని దండ ఆమె మెడలోకి మారుతోంది గురుదీవెన అందుతోంది"

సవ్యసాచి మేష్టారు తన మెడ లోని దండను సిస్టర్ క్రీస్తుకళ మెడలో వేశారు.

కరతాళ ధ్వనులు మిన్ను ముట్టాయి!

నోరు తెరుచుకుని చూస్తుండి పోయాను నేను

క్రీస్తు కళ వంగి, మేష్టారుకి పాదాభివందనం చేసింది.

మళ్లీ మ్రోగింది మేష్టారి కంఠం "మా ఆవిడ మెడలోని దండ ఏ అపరంజి బొమ్మకు అంకితమో ఆవిడే చెబితే బాగుంటుంది" అని కూర్చున్నారు.

వేదవతి లేచి నిలుచున్నారు. మైక్‌ని తనే సవ్యంగా అమర్చుకొని "అర్థోక్తిలో ఆపెయ్యడం ఆయన అలవాటు. మా జీవితాలు అర్థోక్తిగా మిగలకుండా ఆదుకోవడం అపరంజి బొమ్మకి అలవాటు. కుమారిని కళా రంగంలో కదిలించి నెయ్యగల శక్తి కుమారికి పోటీ కాకూడదని నెక్కి తగిన వ్యక్తి - ఆరోగ్యం అంత మాత్రాన అనటంచే కళారాధనకి కడుదూరాన కుసుమాంజలియైన వ్యక్తి - పన్నెండేళ్ల పైగా తన జీతం మొత్తం నెలనెలా గురుదక్షిణగా సమర్పించుకుంటున్న మహోన్నత వ్యక్తి మీ ముందు కొద్ది సేపటిలో నిలుస్తుంది. తన గురుదక్షిణని గుప్తంగా వుంచాలని కోరిన ఆమె కోరికను తిరస్కరించి, ఈ నాడు మళ్లీ మీ ముందు గజ్జెకట్టమని కోరిన నేను - ఆ కళామూర్తి కంఠసీమలో ఈ సుమమాలని కళారధనయ్యాకే వెయ్య దలచుకున్నాను. వేచి వుండమని కోరుతున్నాను"

వేదికపై నుండి ఆది దంపతులు కదలారు. వాలంటీర్లు యిద్దరు వచ్చి టేబుల్, కుర్చీ తీసేశారు. మృదంగ వాద్యం మొదలైంది.

పలుచటి తెల్లని పట్టు చీర తెరలో తెరకాగా, తెర క్రింద నుండి పాదాలు కాంతులు విరజిమ్ముతోంటే, తెరపై నుండి పొడవాటి వాలుజడ యిటు, నేపుగా లయ విన్యాసాలు చేస్తోంటే, సత్యభామ కదలి వచ్చింది. భామా కలాపం మొదలైంది!

**నవ్వు**

"చూశావా ఒరా, మనకి అబ్బాయి పుట్టాడని తెలియగానే మా స్నేహితుడు రమేష్ ఎంత తొందరగా వచ్చాడో."

"అబ్బాయి కూడా కలిగాడా? నేను వచ్చింది మీ పెళ్లి [illegible] చూపిం!" — రమేష్ సమాధానం.

"భామనే - సత్యభామనే

సత్యభామనే - సత్యభామనే" - సవ్యసాచి మేష్టారి కంఠం భావనల విరజిమ్మింది. ఏ ఊర్ధ్వలోకాలకో తరలించి, నిసర్గ సౌందర్యంతో నినదించింది. రస రమ్య రాగసుధల విరజిమ్మింది!

తెరలో తెర విడిపోయింది.

ప్రమీల సత్యభామ రూపంలో స్టేజి మీద గోచరించింది!

కళ్లు చెదరిపోగా, చూస్తున్నది కలో నిజమో అర్థం కాక, నిజ జీవితపు నా సత్యభామని తనివి తీరా చూస్తుండి పోయాను. పిల్లలు పరవశించి పోసాగారు.

"వయ్యారి, ముద్దుల - సత్యభామనే"

విశిష్ట కదలికలు.

విస్పష్ట గతులు

దీటైన పోకడలు

ముచ్చటైన ముడుపులు

పెళ్లయిన పదిహేనేళ్లలో ప్రమీల నా కంటికి ముద్దుగా, వయ్యారంగా ఎప్పుడూ కనిపించ లేదు. మధురమైన ఆకృతి. సొంపు సొంపుల ద్యుతి. సన్నటి నడుము. లయబద్ధపు కదలిక. మెరుస్తున్న కపోల కాంతులు - మంచు రేకులని దూసిపోస్తున్న కళ్లు! కెంపుల్లాంటి పెదాలు - ఆహ్లాదకరమైన హావ భావాలు! ఆ, సౌందర్య నాట్య లీలలో,

కలహంస నడగతులలో

విరిసిన వెన్నెల వన్నెలలో

నా నెమ్మలోంచి ఏదో వణుకు! భరించలేని భావావేశం! ఉన్మాదాన్ని కలిగించే మన స్థితి!

ఆమె ఆకుపచ్చని జరీ పట్టుచీర తళ తళ లాడుతోంది. నడుము లోని వడ్డాణం మిలమిల లాడుతోంది. పచ్చల పతకం రాళ్లు, ఇంద్రనీల కాంతుల విరజిమ్ముతూ, కపోల కాంతుల్లో కలిసి పోతున్నాయి. అరమండిలో కుచ్చిళ్లు అలవోకగా విచ్చుకుంటున్నాయి.

"భామనే, పదియారువేల కోమలులందరి లోన

లలనా, చెలియా, మగువా, సఖియా"

పదియారు వేల కోమలులలోనే కాదు - పది కోట్ల కోమలులలో కూడా సత్యభామ భామనే!

హావభావభంగిమలన్నీ లయబద్ధంగా ప్రకటిస్తోంది. గజ్జెలు ఘల్లుమంటుంటే, కమలాల తూడు లాంటి కరకమలాలని వంచి, నట్టువంగాని కనుగుణంగా కాళ్ల కదుపుతోంది. కమనీయ భావనా చాతురి చూపుతోంది. కళలు విరిసి మెరసేలా, విలాసంగా వాలు జడ విసరేస్తోంది. కళ్లు చక్రాల్లా తిప్పుతోంది. వాలు చూపులు, ఓర చూపులు, గర్వంపు చూపులతో - గర్వ కారణంగా వుంది సత్యభామ!

"ఇంతినే, చామంతినే, మరుదంతినే, విరిదంతినే

జాణతనమున సతులలో నెరజాణనై వెలసేటి దాన

భామనే - సత్యభామనే"

సతులలో నెరజాణయైన

ఈ సత్యభామలో,

మెరుపుంది.

విరుపుంది.

హొయలున్నాయి - లయలున్నాయి

కెంజాయ కెంపుల కాంతులున్నాయి

హరిత సౌందర్య రేఖలున్నాయి

ఆర్తి వుంది - ఆరాధన వుంది

అంతర్ముఖ సాక్షాత్కారముంది!

నిరవిందైన ఆమె నెమలి నాట్యంలో నా తనువు పులకరించింది. తన్మయత్వం తీరకముందే నాట్యం ముగిసింది! ఆయాసంలో, ఎగసిపడే గుండెలతో నాట్య మయూరి నమస్సులిడగా,

వేదవతిగారి మెడలోని సుమమాల

సత్యభామ కంఠంలో కమనీయంగా వెలసింది!

* * *

కారు దగ్గర అరగంట పైగా వెయిట్ చేశాక కాని, ఇవతలకి ఊడి పడలేదు ప్రమీల.

ఆ, అరగంటలో-

నా చుట్టూ ఏదో కాంతి వలయం

నా చేతులు పట్టుక నుంచున్న చిన్నారుల చేతుల్లో ఏదో స్పందన!

మాటలు రాక మనసులు మూగబోయిన సుస్థితి!

ఏమిసి నడచి వచ్చింది ప్రమీల. చేతిలోని వ్యానిటీ బ్యాగ్‌ని కారులో విసరేసి, సిస్టర్ క్రీస్తు కళ వేపు చెయ్యి ఊపుతూ, కారులో కూర్చుంది.

"పదండిక. ఎంత ఆలస్యమో" అంది.

"నువ్వింత బాగా డాన్సు చెయ్యగలవని ఊహించ లేదు భామా!" అన్నాను

చుర చురా చూసింది ప్రమీల "బుద్ధిలేక పోతే సరి! కుప్పిగంతులు చూసి మనసుకు కుట్లు పట్టించుకోకండి. ఈ అద్భుతాలు ఐదుదు నిముషాలే! జీవితం నందేళ్లది! సంగీతం, డాన్సూ కూడు పెట్టవు. సరిగ్గా నడుపుకుని చావండి! కారు స్టార్టు చెయ్యరేం? మీకూ మతి పోయిందా? టైమ్ ఎంతో తెలుసా? పిల్లలు ఆకళ్లతో చచ్చిపోతారు. అటువైపు కాదు - అమ్మా వాళ్ల ఇంటికి" అంటూ అలరింపు పాడింది.

ఈ ఉమన్ ఇన్ బ్లాక్‌ని అర్థం చేసుకోలేక, అహమికతో కారు కదల్చాను!